నవగీతం
తెలుగు దినపత్రిక
గురువారం
17 సెప్టెంబర్ 2026

# సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది.

నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లలో ప్రాధాన్యత, దేవాలయాల్లో సంప్రదాయ వృత్తికి తగిన గుర్తింపు: పైడాకుల అశోక్.

**ములుగు,సెప్టెంబర్16,(నవగీతం)** తరతరాలుగా తమ సంప్రదాయ వృత్తినే నమ్ముకొని జీవిస్తున్న నాయి బ్రాహ్మణ కుటుంబాల సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ హామీ ఇచ్చారు.
ములుగు జిల్లా కేంద్రంలో బుధవారం తెలంగాణ నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ సంఘం ప్రతినిధులతో మాట్లాడారు. అనంతరం అశోక్ మాట్లాడుతూ, ఎంతో కష్టపడి పనిచేసే నాయి బ్రాహ్మణ కుటుంబాలు ప్రస్తుత కాలంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, గృహ వసతి అందాల్సిన అవసరం ఎంతో ఉందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి నిరుపేద నాయి బ్రాహ్మణ కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ప్రాధాన్యత కల్పించేలా మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రి సీతక్క నాయి బ్రాహ్మణుల పక్షాన ఎల్లప్పుడూ అండగా ఉంటారని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ముఖ్యంగా దేవాలయాల్లో నాయి బ్రాహ్మణుల సంప్రదాయ సేవలకు తగిన గుర్తింపు, ప్రాధాన్యత కల్పించడంతో పాటు వెంట్రుకల సేకరణ, కేశ సేవలకు సంబంధించిన హక్కులు, అవకాశాల్లో వారి వాటా వారికి దక్కేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. నాయి బ్రాహ్మణుల సంక్షేమం కేవలం హామీలకే పరిమితం కాకుండా, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా కాంగ్రెస్ పార్టీ తరపున తనవంతు సహకారం అందిస్తానని అశోక్ స్పష్టం చేశారు. దీంతో సమావేశంలో పాల్గొన్న నాయి బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.


ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు, నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# శివాజీయూత్, ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గణనాథుని వద్ద మహా అన్నదానం

**కొడిమ్యాల,సెప్టెంబర్ 16.(నవగీతం)** కొడిమ్యాల మండలం చెప్యాల గ్రామంలో ఆధ్యాత్మిక శోభ విల్లివిరిసింది. వినాయక చతుర్థి ఉత్సవాలను పురస్కరించుకుని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలోని గణనాథుని మండపం వద్ద ముదిరాజ్ సంఘం, ఛత్రపతి శివాజీ యూత్ సంయుక్త ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో మహా అన్నదాన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ సేవానిరతిని స్ఫూర్తిగా తీసుకుని,ఆధ్యాత్మికతకు సామాజిక బాధ్యతను జోడించి యువత ఈ పుణ్యకార్యాన్ని దిగ్విజయం చేశారు.?అన్న వితరణకు ముందు మండపంలో కొలువుదీరిన విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు, శాస్త్రోక్తంగా అభిషేకాలు నిర్వహించారు.అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించగా, గుంటుకుల లింగారెడ్డి దాతగా వ్యవహరించి తమ ఉదారతను చాటుకున్నారు. స్వామివారి మహాప్రసాదాన్ని స్వీకరించడానికి చెప్యాల గ్రామ ప్రజలు, మహిళలు, వృద్ధులు,యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.?సేవా పథంలో ముదిరాజ్ సంఘం యువకులు శివాజీ యూత్ గ్రామంలోని యువత అంతా ఒక్కటై భక్తులకు స్వయంగా వడ్డనలు చేస్తూ, క్రమశిక్షణతో సేవలందించి స్థానికులకు ఆదర్శంగా నిలిచారు.సనాతన ధర్మ పరిరక్షణతో పాటు సమాజ సేవలో యువత ముందంజలో ఉండాలని చాటిచెప్పిన ఈ అన్నదాన కార్యక్రమం గ్రామస్థులందరి అభినందనలు పొందింది.కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు
?మందల గోపాల్ రెడ్డి,తిరుపతిరావు,శివకుమార్
?గుంటి ఎల్లయ్య,సతీష్, బాస సాయి చరణ్
?గుంటి రాజు,ఒరగంటి సునీల్,కల్వకోట మహేష్
?వరగంటి అంజయ్య, అరుణ్ కుమార్, గణేష్,అనిల్.కల్వకోట మహేష్
?వరగంటి అంజయ్య, అరుణ్ కుమార్,గణేష్, అనిల్
?సనాతన ధర్మ పరిరక్షణతో పాటు సమాజ సేవలో యువత ముందంజలో ఉండాలని చాటిచెప్పిన ఈ అన్నదాన కార్యక్రమం గ్రామస్థులందరి అభినందనలు పొందారు.



# లొంగిపోయిన మావోయిస్టుల పునరావాసానికి చర్యలు వేగవంతం చేయాలి.

జిల్లా కలెక్టర్ బోర్ఢేడే హేమంత్ సహదేవరావు.

**ములుగు, సెప్టెంబర్ 16,(నవగీతం)** అడవి బాటను వీడి జనజీవన స్రవంతిలో కలవాలని ముందుకు వచ్చి లొంగిపోయిన మావోయిస్టుల పునరావాస ప్రక్రియను వేగవంతం చేయాలని ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఢేడే హేమంత్ సహదేవరావుఅధికారులను ఆదేశించారు.
ములుగు జిల్లా కలెక్టరేట్ లో బుధవారం, లొంగిపోయిన మావోయిస్టుల పునరావాసానికి సంబంధించి జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ఎస్పీ, రామ్నాథ్ కేకన్, ఐ.టీ.డీ.ఏ.పీవో లెనిన్ వస్సల్ టోప్పోలతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, హింసా మార్గాన్ని వదిలి శాంతి మార్గంలోకి వచ్చిన ప్రతి ఒక్కరినీ ప్రభుత్వం ఆదరిస్తుందని, వారికి అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన సరెండర్ అండ్ రిహాబిలిటేషన్ పాలసీ ప్రకారం అర్హులైన ప్రతి ఒక్క లొంగిపోయిన మావోయిస్టుకు పునరావాస ప్రయోజనాలను వెంటనే కల్పించాలని ఆదేశించారు.

**శాంతి, అభివృద్ధే లక్ష్యం:**
రాష్ట్ర ప్రభుత్వం శాంతి, అభివృద్ధిని కాంక్షిస్తోందని, ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని కలెక్టర్ అన్నారు. మావోయిజం ప్రభావిత ప్రాంతాల్లో యువత పెడదోవ పట్టకుండా ఉండేందుకు ఉపాధి, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు.
లొంగిపోయిన వారికి ఇళ్ల స్థలాలు, ఆర్థిక సహాయం, ఉపాధి శిక్షణ, రుణ సౌకర్యం వంటి అంశాల్లో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. వారి కుటుంబాలకు భద్రత కల్పించడంతో పాటు, సమాజంలో గౌరవంగా బతికేలా చేయడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు.
ఇప్పటికే లొంగిపోయిన మావోయిస్టుల వివరాలను పూర్తిగా పరిశీలించి, వారి కేసుల స్థితిని, అర్హతను బట్టి తక్షణమే రిహాబిలిటేషన్ ప్యాకేజీ అమలు చేయాలని ఎస్పీకి, ఐటీడీఏ అధికారులకు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఇంకా అడవుల్లో ఉన్న మావోయిస్టులు కూడా ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలో కలవాలని కలెక్టర్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# సీఎం రేవంత్ రెడ్డి,మంత్రి సీతక్క,ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటాలకు పాలాభిషేకం

**?కొడిమ్యాల సెప్టెంబర్ 16.(నవగీతం)** గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఇంటి పన్నులు, కుళాయి పన్నులు, ఇతర పన్నుల వసూళ్లను గ్రామాల అవసరాలకు అనుగుణంగా వినియోగించుకునేలా వెసులుబాటు కల్పిస్తూ 2018 పంచాయతీరాజ్ చట్టానికి సవరణలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక బిల్లు తీసుకురావడంపై కొడిమ్యాల సర్పంచ్‌ల ఫోరమ్ హర్షం వ్యక్తం చేసింది. ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ మండల కేంద్రంలో సర్పంచ్‌ల ఫోరమ్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు.?ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డి.సీతక్క,చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటాలకు సర్పంచ్‌ల ఫోరమ్ నాయకులు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు.?ఈ సందర్భంగా సర్పంచ్‌ల ఫోరమ్ మండల అధ్యక్షుడు కాడారి మల్లేశం మాట్లాడుతూ...గత ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచ్‌లు సొంత నిధులు వెచ్చించాల్సి వచ్చి, తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తుచేశారు.ప్రజల సమస్యలను, గ్రామాల అవసరాలను క్షేత్రస్థాయి నుంచి తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్పంచ్‌ల ఇబ్బందులను అర్థం చేసుకుని, ఈ చట్ట సవరణ తీసుకురావడం అభినందనీయమన్నారు.స్థానిక పన్నుల ఆదాయాన్ని గ్రామాలకే వినియోగించే అవకాశం కలగడం వల్ల పారిశుద్ధ్యం, తాగునీరు, వీధిదీపాలు, డ్రైనేజీలు, రహదారుల అభివృద్ధి వేగవంతమవుతుందని తెలిపారు.?జిల్లా సర్పంచ్‌ల ఫోరమ్ ఉపాధ్యక్షుడు గడ్డం జీవన్ రెడ్డి మాట్లాడుతూ...పంచాయతీల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచే నిర్ణయాలు తీసుకోవడం వల్ల గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సర్పంచ్‌లకు మార్గం సుగమమైందని, ఇది గ్రామీణాభివృద్ధిలో మరో ముందడుగని పేర్కొన్నారు.?ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరమ్ నాయకులు నేరెల్ల మహేష్, బండ శ్రీనివాస్ రెడ్డి, ఎం.డి. శాబోద్దీన్, మేకల మాళవిక శ్రీకాంత్, ఉట్కూరి శ్రీలత రాజశేఖర్ రెడ్డి, వినోద్ నాయక్, తిరుపతి, అంజయ్య, పిట్ల అనూష శేఖర్, బొడ్డేలి నాగమణి, షేక్ షాజియా హుస్సేన్, సురకంటి లావణ్య, ముత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సహాయం ..



**భీంగల్ , సెప్టెంబర్ 16, (నవగీతం)** ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన బడా భీమ్‌గల్ గ్రామానికి చెందిన దుమ్మాల లింబన్న భార్య కుటుంబానికి గ్రామ ఛాలెంజ్ యూత్ అసోసియేషన్ సభ్యులు అండగా నిలిచారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన యూత్ సభ్యులు, తమ సంఘం ఆధ్వర్యంలో సమకూర్చిన రూ.25,000/- ఆర్థిక సాయాన్ని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా యూత్ ప్రతినిధులు మాట్లాడుతూ... ప్రమాదవశాత్తు కుటుంబ పెద్ద దిక్కును కోల్పోవడం అత్యంత విచారకరమని, బాధిత కుటుంబానికి తమ వంతుగా ఈ చిన్నపాటి సాయం అందించామని తెలిపారు. యువత ఎల్లప్పుడూ సమాజ సేవలో, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో ముందుంటుందని పేర్కొన్నారు. లింబన్న కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఛాలెంజ్ యూత్ అసోసియేషన్ సభ్యులు, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గణనాథునికి పూజలు

31వ వసంతంలోకి 'స్వరపల్లకి' గణపతి ఉత్సవాలు



**కొడిమ్యాల సెప్టెంబర్ 16, (నవగీతం)** కొడిమ్యాల మండలం చెప్యాల గ్రామంలో ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం నిర్వహిస్తున్న శ్రీ సిద్ధివినాయక నవరాత్రి మహోత్సవాలు భక్తి పారవశ్యంతో, ఆధ్యాత్మిక శోభతో అత్యంత వైభవంగా సాగుతున్నాయి.'స్వరపల్లకి యూత్' ఆధ్వర్యంలో 31వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన ఈ ఉత్సవాల్లో ప్రతిరోజూ వేదమంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ పూజా కార్యక్రమాలు నిష్టతో నిర్వహిస్తున్నారు.విఘ్నేశ్వరునికి దివ్య పంచామృతాభిషేకం ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు స్వామివారికి విశేష అర్చనలు, పూజలు జరిగాయి.ఈ దివ్య వేడుకలో గ్రామ ఉప సర్పంచ్ సాయికుమార్ తమ సతీమణి, కుటుంబ సమేతంగా పాల్గొని విఘ్ననాశకుడైన(బొజ్జ గణపయ్య)గణనాథునికి ప్రత్యేక పూజలు సమర్పించారు.అనంతరం స్వామివారికి భక్తిశ్రద్ధలతో పంచామృతాభిషేకం గావించి, గరికెతో అర్చించారు. ఊరంతా సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, భోగభాగ్యాలు ప్రసాదించాలని ప్రార్థించారు.?ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీక ఈ సందర్భంగా ఉప సర్పంచ్ సాయికుమార్ మాట్లాడుతూ..."మూడు దశాబ్దాలకు పైగా నిర్విరామంగా శ్రీ బొజ్జ గణపయ్య సేవలో తరిస్తూ, గ్రామంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తున్న 'స్వరపల్లకి యూత్' సభ్యుల భక్తితత్పరత కొనియాడదగినది.ఆ విఘ్నేశ్వరుని దివ్య ఆశీస్సులతో యువత ధర్మమార్గంలో పయనిస్తూ, సేవా గుణాన్ని అలవర్చుకోవడం అభినందనీయం" అని పేర్కొన్నారు.?'ఓం గం గణపతయే నమః' నామస్మరణలతో భక్తజనం పారవశ్యంలో మునిగితేలగా, భక్తులందరికీ తీర్థప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో స్వరపల్లకి యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే.

ప్రతీ కుటుంబానికి ఖర్చుల నిమిత్తం పది వేల ఆర్థికసాయం.




**ములుగు,సెప్టెంబర్ 16,(నవగీతం)** వాజేడు మండలంలోని పేరూరు గ్రామంలో ఇటీవల పొలం లో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ కు గురై మృతి చెందిన తుమ్మ అభిషేక్ ,పంది సమ్మయ్య, అదే ఘటనలో గాయపడిన పోశెట్టి సురేష్ రాంపురం గ్రామానికి చెందిన ఓ యువకుడు మృతి చెందగా అదేవిధంగా చింతూరు గ్రామానికి చెందిన ములకల ఆనందరావు పిడుగుపాటుతో మృతి చెందిన బాధిత కుటుంబాలను భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు పరామర్శించారు ఆర్థిక సహాయం కింద ప్రతి ఒక్క కుటుంబానికి పదివేల రూపాయల నగదు అందజేశారు.వారి కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకొని ప్రభుత్వపరంగా వచ్చే సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ బాబు ములుగు జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ చెన్నం ఎల్లయ్య సొసైటీ ఉపాధ్యక్షులు వత్సవాయి జగన్నాధరాజు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్కే కాజావలి ఆదినారాయణ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు గౌరారపు సర్వేశ్వరరావు కాంగ్రెస్ నాయకులు రమేష్ కాకర్లపూడి కళ్యాణ్ కాళీ కృష్ణ సర్పంచుల సంఘం అధ్యక్షులు బోధ బోయిన భరత్ కుమార్ వివిధ పంచాయతీల సర్పంచులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏపీలో 5 వేల శ్రీవారి ఆలయాలు నిర్మిస్తాం

-మొదటిపేజీ తరువాయి

శాతం గ్రీన్ కవర్ ఉందని, దీన్ని మరింత పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన పిలిగ్రిమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో శ్రీవారికి నిర్వహించే నిత్య కైంకర్యాలు, పూజా కార్యక్రమాలు, తిరుమలలోని వివిధ ప్రాంతాలను త్రీడీ సాంకేతికత ద్వారా భక్తులు వీక్షించే అవకాశం కల్పించారు. 6 డీవీఆర్ వర్చువల్ రియాలిటీ ద్వారా తిరుమల దర్శన అనుభూతిని ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించారు. గతంలో ఉన్న ఎస్వీ మ్యూజియాన్ని ఆధునీకరించి పునః ప్రారంభించారు. శ్రీవారి వైభవం, తిరుమల చరిత్ర, పురాణ గాథలు, శ్రీవారి పరిణయం తదితర అంశాలను భక్తులకు సులభంగా అర్థమయ్యే రీతిలో ప్రదర్శించేలా టీటీడీ ఈ మ్యూజియాన్ని సిద్ధం చేసింది. తిరుమలలో భక్తుల రాకపోకలకు వీలుగా రిలయన్స్ ఫౌండేషన్, భారత్ బయోటెక్ సంస్థలు అందించిన 32 ఎలక్ట్రిక్ బస్సులను సీఎం జెండా ఊపి ప్రారంభించారు. రిలయన్స్ ఈ--మోబిలిటీ సీఈఓ నితిన్ సేత్, భారత్ బయోటెక్ ఎండీ సుచిత్రా ఎల్లా, మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

